# ఊర్వశీ పురూరవము

వెనుకటి తరువాయి.

-[భావ రూపకము.]

| | | |
|---|---|---|
| ప్రథమాంకము.<br>ద్వితీయ రంగము. | దృశ్యము—అడవి. | ఊర్వశి, చిత్రలేఖ,<br>రంభాదులు.<br>పురూరవుడు. వయస్యుడు. |

ఊర్వశి—చిత్రలేఖ.

చిత్రలేఖ :

చెలీ! నీవదిగోయని చూపి యింతదవ్వునకుఁ గొనివచ్చిన లతానికుంజము మాటమఱచి యింకను ముందునకుఁ దీసికొనిపోవుచుంటివి మనమిప్పుడే మన చెలులకందఱకుఁ జాలదూరమైతిమి. నిజముగ నీ మనస్సు నీలో లేదు.

ఊర్వశి :

సఖీ! అట్లే యనుము. ఇదియేనా నేనన్న లతానికుంజము ?

చిత్రలేఖ :

ఇదియే! లోనికరుగుదమా ?

ఊర్వశి :

లోపలికేల ? పైనిఁగల చోద్యమొకటి చూచితిమి కనుకనా ?

చిత్రలేఖ :

నిజముగ నీవీకడకుఁ బాదరింటి కొఱకు రాలేదు. మనస్సున నెయ్యంపు టూహ యెయ్యదియో పెట్టుకొని జగము రోయుచుంటివి. నాతోఁ జెప్పక కప్పిపుచ్చెదే ?

ఊర్వశి :

ఏమియు లేదు. ఇచోఁ జల్లగనున్నది. కూర్చుందము.

చిత్రలేఖ :

ఏవీ నీమేకపిల్లలు ?

ఊర్వశి :

ఇందే తిరుగాడుచుండు: నవిగో, వాని మాటకేమి ? రమ్ము. కూర్చుండుము.

చిత్రలేఖ :

[తనలో] అంత నిర్లక్ష్యముగఁ దన పెంపుడులను నాచెలి యింతకుము న్నెన్నండు నని యెఱుగడు.

[ప్రకాశముగ] నెచ్చెలీ! ఏమో అధిక సంతాపము సూచించుచుంటివి. మన చెలులెల్లఱు విచ్చలవిడి విహరించుచుండ మన మిట్లుంటఁ దగునా ?

ఊర్వశి :

సఖీ! నీకును విహరింపఁ గోరికయున్న వారితో నుండుము. ఏలాకో! నాకొక సంస్మరణ మధిక దుస్సహమగుచున్నది

చిత్రలేఖ :

అది సంస్మరణ మాత్రముగనే తోఁచుట లేదు.

మ. కనుఱెప్పల్ తెరువాట్లు గొట్టెడిని ను
 త్కంఠాతిరేకంబులై,
 తనువున్ జెమ్మటవో సెడిన్, తుణచల
 త్తారుణ్యమే పాఱెడిన్,
 మునునొక్కప్పుడు నింద్రుసమ్ముఖమునన్
 భూపాలుఁ డొక్కండు చూ

పినయూపున్ బ్రతిదోఁచుచుంటి వినుమా!
వింతౌదు నాకెంతయున్,

ఊర్వశి :

ఏమే ? నీయుత్ప్రేక్ష !

సీ. ఎత్తు లతలఁ దలయెత్తి పువ్వులుగోయఁ
బడిన పుష్పాళి మూతవడిన కనులు,
ఇంచుసోవల నలయికను జేయుచుఁ గ్రోలు
నపుడు దుంపుఱ నార్ద్రమైన యోష్ఠలు,
నీరెండ రమ రమణీయరాగముతోడఁ
బైఁబడునెడ మీఱు పసిడి మిసిమి,
వసుధ వేష్టను గనుబట్టు క్రొంగ్రొత్తలు
చూచుతోడను మదిఁ దోఁచువింత,
ఎంతగను జేసిచెప్పితే ? యింత కింత
నీకు నగపడునవి సుమ్మి ! నేరవేమొ ?
అయిన పోనిమ్ము - ఇంక నీకల్ల రాత్రి
అల్ల నృత్యంబు జ్ఞాపకంబబె యదంత ?

చిత్రలేఖ :

జ్ఞాపకముగాక మఱపువచ్చునా ? ఒక వేళ నాభూపాలుండు మఱపువచ్చినను వాని వైపు నీవు పఱపిన యోరచూపునాకు మఱపు రానేరదు. ఆచూపువల్లనే

క. తాళము రాగము నృత్యము
లీల నొకటికాక వేఱురీతిగఁ బడఁగన్
జాలనఁ జేసితి దివిజుల
యేలిక నానాటిరేయి నెప్పుడుమఱువన్

ఊర్వశి :

పోదూ ! ఏమి యాక్షేపింతువు ? [అని గుక్కిళ్ళుమింగుచు] ఆ రాజశేఖరుఁడు రాకపోయినఁ దీఱిపోవును.

చిత్రలేఖ :

రాకపోయిన మాకునీవు తక్కియుందువా ? రక్కసులవాతఁ బడియుందువు.

ఊర్వశి :

ఆమాటిప్పు డనకుము. ఒడలు ఝల్లుమనుచున్నది.

చిత్రలేఖ :

భయముతోడతని పేరు స్మరింపుము. అతని పేరేమి ? అయ్యో ! మఱచిపోతినే ?

ఊర్వశి :

పురూరవుఁడు. [తనలో] పేరనునంత తమి యుప్పతిల్లుచున్నది.

చిత్రలేఖ :

అగునే. పురూరవ చక్రవర్తి. భూమిపైనే యుండవలయును. ఎవ్వరికిఁ జయింపరాని రక్కసులఁ బరిమార్చి నిన్నింద్రున కప్పగించునెడఁ బురూరవ చక్రవర్తికి జయ్ ! జయ్ ! అని విజయఘోషతో లాజలు జల్లినప్పుడేని యీ నామధేయము నానోటనుండి యిప్పుడు వెలువడియుండినంత మధుమధురమని యనిపించలేదు. విను. మెద్దియో మేఘగర్జనమేమో ? మన పంథ కడ్డము రాగలదు.

ఊర్వశి :

[దిక్కులుసూచి] ఏమియులేదు. మన చెలుల విహారగీతిక.

చిత్రలేఖ :

అటువైపుగా దిటు. విను. అదిగో రథనేమి ధ్వని. రథము. రథముపై నెవ్వరో యింత పురుషులు వచ్చుచున్నారు. రమ్ము లోపలికి రమ్ము. [అని యిరువురు లతానికుంజము సొత్తురు.]

[రథముపైఁ బురూరవుడు వయస్యుడు ప్రవేశము.]

ప్రియవయస్యుడు :

ఆర్యపుత్రా ! ఎంతదూరము దీసికొని వచ్చితివి ! చింతపైఁ గొంగలఁ జూపించి నల్లే యిదిగో అదిగో అనుచు లాగికొని

వచ్చితివి. వృథాప్రయాసతప్ప మఱొండు గాదు. వెనుకకు మఱలుదము.

పురూరవుడు :

ఏమి? మిత్రమా! రథముపై వచ్చియే యింత యలసిపోతివా? పై నెగిరిన యచ్చరలను జూచితిమని త్రోవలో మనకగపడ్డ గొల్లవాండ్రుగూడ చెప్పిరికదా. తొందఱ పడకుము. చూడుమీ వనసౌందర్యము.

ప్రియవయస్యుఁడు :

ఇట్టివనమ్ములెన్నేనిగంటి. అందున లెక్కలేనన్ని పెద్దపులులంగంటి.

పురూరవుడు :

ఇక్కడ పెద్దపులులు లేవు. అవిగో! అవిగో! మేఁక పిల్లలు. [అని మేఁకపిల్లలం దీయును.]

చిత్రలేఖ :

ఊర్వశీ! అవి మన మేఁకపిల్లలవలెనే యున్నవి.

ఊర్వశి :

అవి మనవే ఆ పురుషవరేణ్యుఁ డెవ్వరో యెత్తుకొనుచున్నాడు.

ప్రియవయస్యుడు :

ఇంతకు మన మడవికిఁ గాళ్ళీడ్చుకొనుచు వచ్చినది మేఁకపిల్లల కొఱకా?

పురూరవుఁడు :

ఎంత నల్లని మృదులంపు టజాశాబకంబులోయీ! మనలోకమునసిట్టివున్నె?

ప్రియవయస్యుఁడు :

నీ కంతయు వింతే! వేలకొద్ది! నాబోఁటి సద్బ్రాహ్మణుఁడు యజ్ఞము దలపెట్టిన నర్బుదములు నిర్బుదములు.

పురూరవుఁడు :

ఇట్టి యమాయకజంతు సంతానమును గన్నప్పుడు యజ్ఞ యాగములఁ దలపెట్టకు. మిత్రమా! ఈ మేఁకపిల్ల మెడ నెద్దియో ముద్రణమున్నది? దీని మెడనున్నది. చదువుము.

ప్రియవయస్యుఁడు :

నేనునేర్చిన నాగరలిపి నీకు వచ్చినదో లేదో పరీక్షింతు. నీవే చదువుము. ఊర్వశియేమో.

పురూరవుఁడు :

'ఊర్వశి' యనియే యున్నది. నా మహారాజ్ఞి నామమునుమా! నీవుకూడ చూచి నిశ్చయపఱుపుము. [వయస్యుడు పరికించు]

ఊర్వశి :

నన్నుఁ దనమహారాజ్ఞి యనుచున్నాడీ యపూర్వ పూరుషుఁ డెవ్వరో కదా?

చిత్రలేఖ :

ఎవ్వరైననేమి? నీదయకుఁ బాత్రుఁడు. మన మిదివఱకుఁ జూచినవాని పోలికనే కన్పట్టుచున్నాడు.

ఊర్వశి :

ఎవరందువు?

చిత్రలేఖ :

ఏమే నీ మాగ్ధ్యము?

ఉ. నీ ముఖసీమపైనిఁ జెలి!
నీ దగు చూడ్కిని నీదు మోవిపై
నీ ముఱియంపుఁ బేరుపయి
నీ దగు కౌనున నీదుసందియున్
గామునిగేరు నీ సొగసు
కాడె కదమ్మ నిమేషమైనఁ గ
న్నేమఱకట్టె చూచినది
యింద్రసభన్ మునుజంకు గొంకఱన్.

ఊర్వశి :

పురూరవుఁడందువా?

చిత్రలేఖ :

సందియ మేల? సందియమైనఁ గనుఁగొని వత్తు [అని పోవుట నభినయించు]

ఊర్వశి :

ఉండుము. నెచ్చెలు లిటువచ్చుచున్నారు వారిపాట సమీపమున వినవచ్చుచున్నది.

[పాటవినిపించు]

పురూరవుఁడు :

ఏమి వయస్యా! ఇంకను జూచుచునే యుంటివా? శిష్యుఁడే మేలనిపించు గురువు వీవు. ఇదిగో.

ప్రియవయస్యుఁడు :

లేదు. అక్షరము లేర్పాటుగఁ గనబడు చున్నవి కాని కూడఁబలుకఁజాలకుంటి. ఊ ....ర్వ....శి....ఊర్వశియే. అచ్చర మచ్చర మనుకొనులో నేమిరో వినఁబడుచు వచ్చి నది. అదిగో! మఱలవిను.

[పాటవినిపించు]

పురూరవుఁడు :

అగును. తొల్లి దేవేంద్రలోకమున నాల కించిన మృదుమధుర కంఠ గీతికాస్థాయిని వినవచ్చుచున్నది. అదుగో! వారందఱిటు వచ్చుచున్నారు.

ప్రియవయస్యుఁడు :

ఆడుచున్నారు.

పురూరవుఁడు :

ఆచెట్ల మొదళుల సందులనుండి వారి జిలుఁగు టంబరము లెట్లు తొలకాడు చున్నవో!

ప్రియవయస్యుఁడు :

మనలం గన్నవారు కాకులవోలె నెగిరి పోదురు. ఇటురా! ఈపుట్టవెనుక పొంచి యుందము. [అట్లు చేయుదురు]

పురూరవుఁడు :

కాకులనకుము. కోకిలలనుము.

ప్రియవయస్యుఁడు :

కంఠమాధుర్యమున—రూపమున దేవ తాస్త్రీలే. అచ్చఱలే! ఇటురా ఇటురా!

పురూరవుఁడు :

కంఠమాధుర్యముననే కోకిలలనుము

ప్రియవయస్యుఁడు :

ఊఁ కోకిలములు—

[రంభాదులు నృత్యగీతముతోఁ బ్రవేశము.]

నృత్యము—గానము.

ద్విపద

"పసివాఁడి యొకపువ్వు వసుధనుఁబడఁగఁ
బసరుమొగ్గొకటి పైకొమ్మ తోడుగ,
బిసరుహాక్షిరో! చక్క విడిచిన పూత
అసదృశంబని కోయ నలరెనాచేత;
ఎండాకు సడరవణించుచు నెగురఁ
గొండాడునట్లుండెఁ గోమలపు టిగురు;
దోరకాయనుగొట్టి దోసిటఁబట్ట.
నోరామ! యదిపండి యున్నది వెట్ట.
అట్లున్నపొద్దిట్టు లరుణిమఁ గ్రుంకఁ
జెట్ల కెంజిగురుల జిగిమీఱి యింక
నునుజుఁడందుకె యిందుఁ మఱిమఱిఁ బుట్టు
మనమేల పుట్టమో మహినింత వట్టు?
సౌందర్య మీభూమి సర్వప్రదమ్ము!
అందఱియందమే అతిసౌఖ్యదమ్ము!

[అని అందఱును ఆడి పాడుదురు.]

[సశేషము.]

—కవికొండల వేంకటరావు, బి.ఏల్.